## క్లుప్తంగా

### రేపు ఎంపీపీ ఎన్నిక

మిడ్జిల్: ఎంపీపీ ఎన్నికను శనివారం ఉదయం 11గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల అధికారి నుంచి ఖాళీగా ఉన్న ఎంపీపీ ఎన్నిక నిర్వహించాలని ఉత్తర్వులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ఎన్నికకు ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని కోరారు.

### నేడు గొర్రెల పంపిణీపై అవగాహన

గండేడ్: ప్రభుత్వం రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నందున అవగాహన కల్పించనున్నట్లు పశు వైద్యాధికారి రాంప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మహమ్మదాబాద్, గండేడ్ మండలాల నుంచి గొర్రెల కాపరుల సంఘాల సభ్యులు, రైతులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

### కుర్వ యాదవ కమిటీ ఎంపిక

మిడ్జిల్: కుర్వ యాదవ సంఘం మండల కమిటీని గురువారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు శంకరయ్య తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా వినోద్‌కుమార్, లక్ష్మయ్య, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, సత్యనారాయణ, శేఖర్, రాజు, కోశాధికారిగా ఈశ్వర్, సంయుక్త కార్యదర్శిగా ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎంపిక చేసినట్లు తెలిపారు.

### డ్రెయినేజీ పనులు ప్రారంభం

చిన్నచింతకుంట: మండలంలోని గూడూర్‌లో డ్రెయినేజీ పనులకు గురువారం సర్పంచ్ కాంతారావు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, కురుమూర్తి, మౌలాలి, శ్రీను, గోపాల్, మహేష్ పాల్గొన్నారు.

### డీసీఎం బోల్తా

అడ్డాకుల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి జాతీయ రహదారిపై డీసీఎం బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు ముప్పు తప్పింది. కర్ణాటకలోని చిక్బల్లాపూర్ నుంచి కూరగాయల లోడ్‌తో డీసీఎం హైదరాబాద్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో అడ్డాకుల వద్ద డీసీఎం అదుపు తప్పి రహదారి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై బోల్తాపడింది. దీంతో డీసీఎంలో ఉన్న కూరగాయలు రోడ్డుపై పడిపోయాయి. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ శివ ఎలాంటి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డాడు. ఇదిలా ఉండగా రహదారిపై కూరగాయలు పడటంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు.

### ఎండ తీవ్రతకు జాగ్రత్తలు తప్పనిసరి

నవాబుపేట: ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, మండల వైద్యాధికారి విజయలక్ష్మి సూచించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎండలకు వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్న తరుణంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని పంచాయతీలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. వాటిని ప్రజలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.
మండలంలోని లింగంపల్లిలో గురువారం సర్పంచ్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు పనులు చేసే చోటకు వెళ్లి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు.

### బీపీ మండల్‌కు నివాళి



జడ్చర్ల టౌన్: బీసీ రిజర్వేషన్ల సాధకుడు బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా పట్టణంలో గురువారం బీసీ నాయకులు చిత్రపటానికి నివాళి అర్పించారు. బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, శ్రీనివాస్, నిరంజన్, శేఖర్, విజయ్‌కుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### వరదనీటి కాల్వ పనుల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు సుందరీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీనిని మినీ ట్యాంక్‌బండ్‌గా మారుస్తుండగా.. అక్కడ నిర్మిస్తున్న వరద నీటి కాల్వ పనులను గురువారం టీయూఎఫ్ఐడీసీ ఎస్ఈ రమణమూర్తి పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, ఎంఈ సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.



# ఆర్‌ఓబీ త్వరగా పూర్తి చేయండి

- చిన్న పని కూడా పెండింగ్ పెట్టొద్దని ఆదేశాలు
- పనులు పరిశీలించిన కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే ఆల



ఆర్‌ఓబీని పరిశీలిస్తున్న కలెక్టర్ రవి నాయక్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు

దేవరకద్ర: పట్టణంలోని ఆర్‌ఓబీకి సంబంధించిన అన్ని పనులు నెలాఖరులోగా పూర్తి కావాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. గురువారం కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పనులను పరిశీలించారు. సంత బజార్ నుంచి ప్రారంభమైన ఆర్‌ఓబీకి పైకి కలెక్టర్, ఎమ్మెల్యేలు నడుచుకుంటూ వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. రెండు వైపుల సర్వీసు రోడ్లు, పిల్లర్ల మధ్య గోడలు, మొక్కలు నాటడం, యూటర్న్‌లను ఏర్పాటు చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న పని కూడా పెండింగ్‌లో ఉండరాదని సూచించారు.

**కేంద్రం నిధులు ఇవ్వలేదు: ఎమ్మెల్యే**

దేవరకద్ర ఆర్‌ఓబీకి కేంద్ర ప్రభుత్వం నిర్మించాలి. మూడేళ్ల పాటు తిరిగి ఢిల్లీలో పలుమార్లు కేంద్ర మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించలేదని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కేంద్రం నిధులు ఇచ్చేలా లేదని విషయం ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తే వెంటనే రూ.24 కోట్లు మంజూరు చేశారన్నారు. బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలకడం మానుకోవాలని సూచించారు. పనులు కొంత ఆలస్యమైన చివరి దశకు వచ్చాయని, ఈ నెల చివరి వరకు అన్ని పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెంటనే ప్రారంభోత్సవం చేసి వాహన దారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. వారి వెంట ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నర్సింగరావు, ఈఈ స్వామి, డీఈ సంధ్య, ఏఈ కౌశిక్, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, సర్పంచ్ కొండ విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

**బస్టాండ్ పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే**

దేవరకద్ర బస్టాండ్‌ను కలెక్టర్ రవి నాయక్, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం సందర్శించారు. అక్కడికి వచ్చిన ఆర్ఎమ్ శ్రీదేవి, డీఎమ్ సుజాతతో వారు మాట్లాడారు. బస్టాండ్‌లో నెలకొన్న సమస్యల గురించి ప్రజలు వారి దృష్టికి తెచ్చారు. బస్టాండ్ ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడితే పలువురికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. అలాగే బస్టాండ్ వెనుక వైపు ఉన్న టాయిలెట్స్ వల్ల చుట్టు పక్కల నివాస ప్రాంతాల ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని తెలిపారు. వెంటనే సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని, ముఖ్యంగా మహిళలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. బస్టాండ్ శిథిలావస్థలో ఉందని వెంటనే మరమ్మతు చేయించాలని లేకుంటే కొత్తగా బస్టాండ్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

# గొల్ల, కురుమల సంక్షేమానికి కృషి



బీపీ మండల్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: గొల్ల, కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని లక్ష్మీనగర్ కాలనీలో గల యాదవ కమ్యూనిటీహాల్‌లో బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ లాలూ ప్రసాద్‌యాదవ్, అఖిలేష్‌యాదవ్ ముఖ్యమంత్రులుగా ఉన్నా కూడా ఆయా రాష్ట్రాల్లో సాధ్యం కాని ఉచిత గొర్రెల పంపిణీ పథకాన్ని రాష్ట్రంలో అమలు పరిచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ముడా చైర్మన్ గంజి వెంకన్న, వెంకటనర్సయ్యయాదవ్, శాంతయ్యయాదవ్, గణేష్, సాయిలుయాదవ్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటోంది**

పాలమూరు: జర్నలిస్టులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, త్వరలో ఉమ్మడి జిల్లాలోని జర్నలిస్టులందరికి ప్రత్యేక హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో గురువారం ఉమ్మడి జిల్లాలో గుర్తింపు పొందిన మహిళా జర్నలిస్టులకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి జిల్లాలో 1,194 మంది జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు ఇస్తే ప్రస్తుతం 1,895 మందికి గుర్తింపు కార్డులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కృష్ణ, సూపరింటెండెంట్ రామకిషన్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్**

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెండు ఫంక్షన్‌హాల్‌లలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరఫున అధికారికంగా 'దావతే ఇఫ్తార్' విందు ఏర్పాటు చేశారు. ఇందులో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి, ఎంపీలు ఉపవాసం దీక్షల అనంతరం పలువురు ముస్లింకు పండ్లు తినిపించారు. మంత్రి మాట్లాడుతూ ఇఫ్తారు విందులు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తారు ఏర్పాటు చేసిందన్నారు. రంజాన్‌లో నిరుపేద ముస్లింలకు తోఫా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అన్వర్ హుస్సేన్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, బీఆర్ఎస్ నాయకులు హనీఫ్ అహ్మద్, షబ్బీర్, మోసిన్, మహమూద్‌అలీ సనా, అంజద్, సమద్‌ఖాన్, అర్షద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు



నవాబుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి రంగులు అద్దుతున్న యువకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో అంబేడ్కర్ జయంత్యుత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని కడిగి చుట్టూ వంగిపోయిన గ్రిల్‌ను మున్సిపల్ అధికారులు బాగు చేయించారు. ఇనుప మెట్లతో పాటు గ్రిల్‌కు రంగులు వేసి పరిసరాలను శుభ్రపరిచారు. ఏర్పాట్లను గురువారం అడిషనల్ కలెక్టర్ సీతారామారావు పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్, ఎంఈ సుబ్రమణ్యం వెంట ఉన్నారు. అలాగే పాత పాలమూరులోని అంబేద్కర్ విగ్రహంతో పాటు 12 వార్డు లోని మరో విగ్రహాన్ని సైతం శుభ్రపరిచారు.

నవాబుపేట: బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఏర్పాట్లు ముమ్మరం చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విగ్రహాన్ని రంగులతో తీర్చిదిద్దారు. దయాపంతులపల్లి, పోమాల్, కొల్లూర్, గురుకుంట, మరికల్, కల్మన్‌కల్వ, కాకర్లపహడ్, కొండాపూర్, రుద్రారం, చాకలపల్లి, లింగంపల్లిలో జయంతి ఏర్పాట్లు చేశారు.

# నేరాల నియంత్రణకే సీసీ కెమెరాలు



భూత్పూర్‌లో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

భూత్పూర్: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్పీ నర్సింహ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, ఎస్పీ నర్సింహతో కలిసి సీసీ కెమెరాల కంట్రోల్ రూంను ఎమ్మెల్యే ప్రారంభించారు. భూత్పూర్ సర్కిల్ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన పోలీస్‌స్టేషన్ల మరమ్మతు, సీసీ కెమెరాలు ఏర్పాటుకు రూ.15లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు చేపడుతున్న ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మండలంలోని 150 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఇందుకు సహకరించిన సీఐ రజితారెడ్డిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేష్, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

**చలివేంద్రం ప్రారంభం**

పట్టణంలోని చౌరస్తాలో పురపాలిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్పీ నర్సింహులు గురువారం ప్రారంభించారు. వేసవి తీవ్రతరం కావడంతో చౌరస్తాలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు, వాహనదారులు వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారని, వారి కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కుండల్లో చల్లనినీరు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## పేదలకు అండగా ప్రభుత్వం

దేవరకద్ర: పేదలకు అండగా ప్రభుత్వం ఉందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రంజాన్ కానుకలను ముస్లింలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయంతో ప్రభుత్వం పని చేస్తున్నదని అన్నారు. తెలంగాణ వచ్చాకా అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని బీజేపీ, కాంగ్రెస్ వారి మాయమాటలు నమ్మవద్దన్నారు. గతంలో ఏమి చేయని వారు ఇప్పుడు వచ్చి ఏమి చేస్తారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ అన్నపూర్ణ, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఏదులాపూరంలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ హేమలత, ఎంపీటీసీ ఉషారాణి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఘనంగా టీఎస్ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టీఎస్ యూటీఎఫ్ పదో ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం స్థానిక కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ కోశాధికారి ఎన్.కిష్టయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తున్నామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేష్, కె.రవికుమార్ మాట్లాడుతూ ఈ వేసవిలోనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సృజన, భాస్కర్, కార్యదర్శి కిష్ట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# కంటి పరీక్షలు చేయించుకోండి



శాఖాపూర్‌లో కంటి అద్దాలను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

అడ్డాకుల: ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు శిబిరంలో కంటి పరీక్షలను చేయించుకోవాలని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని శాఖాపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. 18 ఏళ్లు పైబడి కంటి సమస్యలున్న వారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరీక్షలు చేయించుకుని కళ్లద్దాలు అవసరమైన వారికి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ మంజుల, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ జయన్నగౌడ్, ఎంపీటీసీ శకుంతల, ఉప సర్పంచ్ రామకృష్ణ, కార్యదర్శి మహేశ్వర్ ఉన్నారు.

మహమ్మదాబాద్: కంటి వెలుగు పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం గాధిర్యాల్‌లో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఆస్పత్రులకు వెళ్లి ఖర్చులు భరించలేని వారు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, ఎంపీటీసీ కోట్ల రాములమ్మ, కోఆప్షన్ సభ్యుడు సలీం, రామకృష్ణ పాల్గొన్నారు.



గాధిర్యాల్‌లో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

**354 మందికి కంటి పరీక్షలు**

భూత్పూర్: మండలంలోని తాటికొండ, ఎల్కిచర్లలో గురువారం 354 మందికి కంటి పరీక్షలు చేసినట్లు సీహెచ్ఓ రామయ్య చెప్పారు. 47 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయగా, 87 మందికి కంటి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు.

# అయ్యో.. అంబేడ్కరా?

- ఐదేళ్లుగా ఆవిష్కరణకు నోచుకోని విగ్రహం
- జయంతి నాడైనా ఆవిష్కరించాలని కోరుతున్న స్థానికులు



ప్రధాన రహదారి పక్కన ఆవిష్కరణకు నోచుకోని అంబేడ్కర్ విగ్రహం

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ – రాయచూర్ ప్రధాన రహదారి పక్కన ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తు ఐదేళ్లుగా అంబేడ్కర్ విగ్రహానికి ముసుగు తీయకుండా వదిలేశారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్‌లో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆవిష్కరణకు నోచుకోలేదు. యావత్తు అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు నిత్యం తిరుగులాడే ప్రధాన రహదారి పక్కన చూస్తు వెళ్తున్నారే తప్పా.. పట్టించుకున్న పాపాన పోలేదు. విగ్రహాన్ని అంబేడ్కర్ జయంతి శుక్రవారం నాడు ఆవిష్కరించి నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులు అర్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కాగా విగ్రహావిష్కరణ విషయంలో నిర్వాహకుల మధ్య నెలకొన్న విభేదాలే కారణమని ధర్మాపూర్ గ్రామస్తుల ద్వారా తెలిసింది.

# కల్తీకల్లు మాఫియాపై పీడీ యాక్ట్ పెట్టాలి




మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కల్తీ కల్లు మరణాలకు కారణమైన వారిపై పీడీ యాక్ట్ పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌కిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ కల్లు మరణాలకు అబ్కారి శాఖ మంత్రి బాధ్యత వహించి పదవికి రాజీనామా చేయాలన్నారు. కల్లు మాఫీయా ఆగడాలను ఆపేవారు లేకుండా పోయారన్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతు కల్తీపై నిఘా లేకుండా పోయిందన్నారు. మృతి చెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలన్నారు. సమావేశంలో సురేష్, రాము, రాజు, పవన్, దావిద్, శ్రీను పాల్గొన్నారు.

# కల్తీ కల్లు మరణాలకు మంత్రిదే బాధ్యత



సూపరింటెండెంట్‌తో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

పాలమూరు: జిల్లాలో కల్తీ కల్లు ఏరులై పారుతుందని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలోని కల్తీ కల్లు బాధితులను గురువారం పరామర్శించడానికి వెళ్లిన కాంగ్రెస్ నాయకులను ముందుగా పోలీసులు అనుమతించలేదు. అనంతరం సూపరింటెండెంట్ రామకిషన్ చాంబర్‌లో కాంగ్రెస్ నాయకులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ జిల్లాలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అనుచరులు కృత్రిమ కల్లు తయారు చేసి అమ్ముతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. కల్తీ కల్లు మరణాలకు పూర్తి బాధ్యత మంత్రి వహించాలన్నారు. కల్తీకల్లు తాగి జిల్లాలో ముగ్గురు మృత్యువాత పడితే మీడియాను, ప్రతిపక్షాలను ఆస్పత్రిలోకి అనుమతించకపోవడం దారుణమన్నారు. కల్తీకల్లు విషయంలో మంత్రి తన అనుచరులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ చేసి వెంటనే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, చికిత్స పొందుతున్న వారిని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒబేదుల్లా కొత్వాల్, సంజీవ్, వసంత, సాయిబాబా, సిరాజ్ ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# యువకుడికి అరుదైన క్యాన్సర్ శస్త్రచికిత్స



శస్త్రచికిత్స అనంతరం యువకుడితో వైద్యులు

పాలమూరు: క్యాన్సర్ చివరి దశలో ఉన్న యువకుడికి శస్త్ర చికిత్స చేసి ప్రాణం పోశారు. వివరాల్లోకి వెళితే నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలోని జక్లేర్ చెందిన సిద్ధు బీజంలో గడ్డ ఏర్పడడంతో ఇటీవల మహబూబ్‌నగర్ క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించాడు. యువకుడిని వైద్యులు బిల్లకంటి రాజ్‌కుమార్, ప్రదీప్‌రెడ్డి, కృష్ణకిశోర్ పరీక్షించగా అతనికి బీజం క్యాన్సర్ చివరి దశలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయనకు నాలుగు సార్లు కీమోథెరపీ ఇంజక్షన్లు ఇవ్వడంతో పాటు ఆర్‌పీఎల్ఎన్‌డీ అనే అరుదైన, అతిక్లిష్టమైన సర్జరీ చేసి పొట్టలోని వ్యాధిని పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సిద్ధు క్యాన్సర్ నుంచి పూర్తిగా కొలుకున్నట్లు తెలిపారు. క్యాన్సర్‌కు సంబంధించి అన్ని రకాల చికిత్సకు కావాల్సిన అధునాతనమైన పరికరాలు, ఇతర సేవలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 150వరకు క్యాన్సర్ శస్త్రచికిత్సలు, 500పైగా కీమోథెరపీలు చేసినట్లు వెల్లడించారు.

# విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అభిషేక్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: బాలబాలికలు చదువుతో పాటు క్రమశిక్షణపై దృష్టి పెడితే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని రూరల్ ఎస్ఐ అభిషేక్‌రెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ శాఖ, సురక్ష పోలీస్‌కళా బృందం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని క్రిస్టియన్‌పల్లి సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల వసతి గృహంలో సామాజిక అవగహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేసుకోరాదని, బలవంతంగా చేయాలని చూస్తుంటే 1098 చైల్డ్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఎవరూ పడరాదని, బ్యాంకు ఖాతాలో డబ్బులు పోతే 24గంటల లోపు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వప్నప్రియ తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పంచాయతీ రాజ్ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా పట్టణంలోని పంచాయతీ రాజ్ ఎస్ఈ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం, మిషన్‌భగీరథ, ఇరిగేషన్ కార్యాలయాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 16వ తేదీన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, ప్రశాంత్ కుమార్, రంజిత్, సునీత, జయమ్మ, శారద, రాఘవేంద్ర, శివశంకర్, విద్యారాణి పాల్గొన్నారు.